'పారదర్శకమైన ఓటరు జాబితా తయారు చేయండి'



ఈఆర్వో కార్యాలయం వద్ద సామ రంగారెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు

ఎల్బీనగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈఆర్వో పర్యవేక్షణలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో డోర్ టూ డోర్ ఓటర్ జాబితా పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రంగారెడ్డి బీజేపీ నాయకులతో ఎల్బీనగర్ మున్సిపల్ కార్యాలయంలో ఈఆర్వో వంశీకృష్ణని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గత కొన్ని ఏళ్లుగా ఓటరు జాబితా ప్రక్షాళన చేయకపోవడంతో సాంకేతిక లోపాలు, దొంగోట్లు నమోదు అయ్యాయని తెలిపారు. బీఎల్‌వోలతో సమగ్ర పరిశీలన చేయించాలని కోరారు. పారదర్శకమైనా ఓటరు జాబితాను రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నవజీవన్‌రెడ్డి, సురేందర్‌యాదవ్, నాయికోటి పవన్‌కుమార్, రంగారెడ్డి జిల్లా సెక్రెటరీలు నూతి శ్రీనివాస్, సుందర్‌నారాయణ, అంజన్‌కుమార్‌గౌడ్, గంగని శ్రీనివాస్, ఆది నరసింహరావు. వెంకటేస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను డీసీ వంశీకృష్ణకు వివరిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

సైకిల్ ట్రాక్, బస్టాప్ షెల్టర్లను తొలగించండి

మన్సూరాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న సైకిల్ ట్రాక్, బస్టాప్ షెల్టర్లను వెంటనే తొలగించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా మంగళవారం ఉదయం విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న హైవేకాలనీ, చంద్రపురి, సరస్వతీనగర్, సింధూర్ ఎన్ క్లేవ్ కాలనీలో హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, ఆయా కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అనాలోచితంగా ప్రజాధనం దుర్వినియోగపరిచి విజయవాడ జాతీయ రహదారి గుండా సైకిల్ ట్రాక్, బస్‌స్టాప్ షెల్టర్లను ఏర్పాటు చేశారని, వీటి ద్వారా పలు కాలనీలకు చెందిన ప్రజలు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. అధికారులు సైకిల్‌ట్రాక్, బస్టాప్ షెల్టర్లను తొలగించాలని, లేదంటే తామే ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగిస్తామని ఆయన అన్నారు. ఈ మేరకు డీసీకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మరిన్ని విద్యుత్ దీపాల ఏర్పాటుకు చర్యలు

కొత్తపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మరిన్ని విద్యుత్ దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన స్నేహపురి కాలనీలో హై మాస్ట్ లైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ రోడ్ నెం.5ఏ లోని ఓపెన్ జిమ్‌లోనూ హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. డివిజన్‌లో 10 హైమాస్ట్ లైట్లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇంకా 15 హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు మంజూరు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అనంతుల సురేందర్‌రెడ్డి, కార్యదర్శి లక్ష్మీకాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి సహకారం అందిస్తా



ప్రభాకర్ దంపతులను సన్మానించిన కిరణ్‌కుమార్, నరేందర్

చాదర్‌ఘాట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ శారదనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు మునుగోటి ప్రభాకర్ మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని మారుతి మందిర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు చిట్టంపల్లి కిరణ్‌కుమార్, నరేందర్, గోవర్ధన్ ప్రభాకర్ దంపతులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మారుతి మందిర్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ప్రభాకర్ తెలిపారు.

'సంప్రదాయ వైద్యంలో ప్రపంచానికి నాయకత్వం వహిస్తున్న భారత్'

సైదాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ వైద్యం ద్వారా సమతుల్యతను పునరుద్ధరించడంలో భారత్ ప్రపంచానికి నాయకత్వం వహిస్తుందని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఎన్‌ఐఐఎంహెచ్) సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గోలి పెంచల ప్రసాద్ తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకు ఢిల్లీలో జరగనున్న రెండో ప్రపంచ అయుర్వేద శిఖరాగ్ర సమావేశాన్ని పురస్కరించుకుని ఎన్‌ఐఐఎంహెచ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో గుజరాత్‌లో జరిగిన మొదటి ప్రపంచ సదస్సు విజయవంతం తరువాత రెండో సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇవ్వడం గొప్ప గర్వకారణమని అన్నారు. ఈ సదస్సుకు 100కు పైగా దేశాలకు చెందిన మేధావులు, పరిశోధకులు, నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు, అభ్యసకులు హాజరవుతారని తెలిపారు. 700 మంది ప్రత్యక్షంగా, 5000 మంది వర్చువల్‌గా పాల్గొనే ఆవకాశం ఉందని వెల్లడించారు. ఈ సమావేశంలో సంస్థ ఏడీలు డాక్టర్ వీ.సుభోస్, డాక్టర్ వెంకటేశ్వర్ రావు, రీసెర్చ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌ను చార్మినార్ జోన్‌లో కొనసాగనివ్వం

సరూర్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను చార్మినార్ జోన్‌లో చేర్చడమంటే ఈ ప్రాంతాన్ని ఎంఐఎం చేతుల్లో పెట్టినట్టేనని, ఎట్టి పరిస్థితుల్లోనూ బడంగ్‌పేట్‌ను ఆ జోన్ లో కొనసాగనిచ్చే ప్రసక్తే లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ స్పష్టం చేశారు. చార్మినార్ జోన్‌లో విలీనానికి నిరసనగా సోమవారం రాత్రి గుర్రంగూడ 6వ, 7వ డివిజన్ల మాజీ కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో అందెల పాల్గొన్నారు. ఆయా డివిజన్లలోని అన్ని కాలనీల నుంచి పార్టీలకతీతంగా దాదాపు ఐదు వందల మంది పౌరులు పాల్గొని చార్మినార్‌లో విలీనం సరికాదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ క్లస్టర్-1,2 అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కౌన్సిల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేన, మాజీ ఉపసర్పంచ్ జంగారెడ్డి పాల్గొన్నారు.

రష్యాలో చిక్కుకున్న వ్యక్తి సురక్షితంగా నగరానికి..



అంజదుల్లాఖాన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న అహ్మద్ తల్లి

చాదర్‌ఘాట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముంబై ఏజెంట్ ద్వారా రష్యాకు వెళ్లి మోసపోయిన వ్యక్తి సోమవారం సురక్షితంగా నగరానికి చేరుకున్నాడు. నగరంలోని రాజ్‌భవన్ రోడ్‌లోని ఎంఎస్ మక్తా నివాసి మహ్మద్ అహ్మద్ ముంబై ఏజెంట్ ద్వారా రష్యాకు వెళ్లి మోసపోయాడు. అక్కడ ఉద్యోగం పేరుతో రష్యా ఉక్రెయిన్ సరిహద్దు యుద్ధం చేయాలంటూ ఒత్తిడి చేయడంతో తాను మోసపోయానంటూ బాధితుడు అహ్మద్ తన కుటుంబీకులకు వీడియో సందేశం పంపాడని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖామాత్యులు జైశంకర్‌కు బాధితుడు అహ్మద్ రష్యాలో చిక్కుకున్న విషయాన్ని ఫ్యాక్స్ ద్వారా విన్నవించారు. రష్యాలోని మాస్కోలో గల భారత రాయబార కార్యాలయం అధికారులు విచారణ జరిపి రష్యా సైన్యం ఉన్నతాధికారులతో చర్చించిన అనంతరం అక్కడి నుంచి విడుదలై సోమవారం సురక్షితంగా నగరానికి చేరుకున్నట్లు అంజదుల్లాఖాన్ వివరించారు.

శివారు కార్పొరేషన్లలో డివిజన్ల విభజన పూర్తి



తుర్కయంజాల్ సర్కిల్ కార్యాలయం

ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్‌బృందం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో విలీనమైన శివారు కార్పొరేషన్లలో డివిజన్ల విభజన ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు మంగళవారం రాత్రి ముసాయిదా ఉత్తర్వులను విడుదల చేశారు. దీని ప్రకారం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లలో మూడేసి చొప్పున మొత్తం ఆరు డివిజన్లు ఏర్పాటు చేశారు. బడంగ్‌పేట్‌లో నాదర్‌గుల్(డివిజన్ నం.57), బడంగ్‌పేట్(డివిజన్ నం.61), బాలాపూర్(డివిజన్ నం.62) పేర్లతో మూడు డివిజన్లు ఏర్పాటయ్యాయి. ఇక మీర్‌పేట్‌లో ప్రశాంతిహిల్స్(డివిజన్ నం.58), జిల్లెలగూడ(డివిజన్ నం.59), మీర్‌పేట్(డివిజన్ నం.60) పేర్లతో డివిజన్లు ఏర్పాటు చేశారు.

57-నాదర్‌గుల్ డివిజన్

గుర్రంగూడ విలేజ్ నార్త్ ఈస్ట్ మూల నుంచి మొదలై నాదర్‌గుల్ రెవెన్యూ విలేజ్ తూర్పు సరిహద్దులోని సాగర్ రోడ్డులో గల హరితపురి కాలనీ మీదుగా నాదర్‌గుల్‌లోని సర్వే నం.518లో టీజీఐవీసీ వర్క్ సెంటర్‌కు చేరుకుని.. అక్కడి నుంచి ఆదిభట్ల రోడ్డులోని వాటర్ బోర్డుకు చెందిన వాటర్ ట్యాంకు నుంచి నాదర్‌గుల్- బడంగ్‌పేట్ రోడ్డు మీదుగా వెళ్లి బడంగ్‌పేట్‌లోని ఉద్యోగ్‌నగర్ మాస్టర్ మైండ్స్ స్కూల్ నుంచి తూర్పు వైపు శేషాద్రినగర్, స్వేచ్ఛా నివాస్ మీదుగా గుర్రంగూడ నార్త్ ఈస్ట్ కార్నర్ వద్ద ముగుస్తుంది.

58- ప్రశాంతిహిల్స్ డివిజన్

మీర్‌పేట్ నార్త ఈస్ట్ కార్నర్‌లోని 14-68 ఇంటి నంబర్ నుంచి మొదలై విజ్ఞాన్‌పురి కాలనీ, నాగార్జునహిల్స్, చైతన్యహిల్స్, శివాహిల్స్, ప్రశాంతిహిల్స్ మీదుగా అల్మాస్‌గూడ మెయిన్ రోడ్డు నుంచి మీర్‌పేట్ పెద్దచెరువును తాకుతూ బృందావన్‌కాలనీ, చింతలకుంట, ఆర్‌సీఐ రోడ్డు, బాలాపూర్ చౌరస్తా, జనప్రియమహానగర్, న్యూఅయోధ్యనగర్, న్యూబాలాజీనగర్, కేశవరెడ్డినగర్, ఆర్‌ఎన్‌రెడ్డినగర్ మీదుగా వెళ్లి 14-68 ఇంటి వద్ద ముగుస్తుంది.

59-జిల్లెలగూడ డివిజన్

తూర్పు వైపు ఉన్న టీకేఆర్ కమాన్ నుంచి మొదలై నందనవనం పక్క నుంచి మీర్‌పేట్‌లోని 14-68 ఇంటి మీదుగా ఆర్‌ఎన్‌రెడ్డినగర్, ఆదర్శహిల్స్, తిరుమలాహిల్స్, కేశవరెడ్డినగర్, వైజేఆర్ కన్వెన్షన్, జిల్లెలగూడ రోడ్డు మీదుగా చంద్రాగార్డెన్స్ ఎంట్రెన్స్ చేరుకుని, అక్కడి నుంచి ఇన్నర్ రింగురోడ్డులోని లక్ష్మీనగర్, మైత్రీపురం కాలనీల మీదుగా టీకేఆర్ కమాన్ వద్దకు వెళ్లి ముగుస్తుంది.

60- మీర్‌పేట్ డివిజన్

కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ ఎంట్రెన్స్ వద్ద మొదలై జైహనుమాన్‌నగర్, జిల్లెలగూడ చెరువు కట్ట మీదుగా మీర్‌పేట్ చౌరస్తా, అటు నుంచి వైజేఆర్ కన్వెన్షన్, జనప్రియ మహానగర్ మెయిన్ రోడ్డు, బాలాపూర్ చౌరస్తా, ఆర్‌సీఐ రోడ్డులోని శివాజీ చౌక్, త్రివేణినగర్, బీడీఎల్-మిధానీ రోడ్డు, ఇన్నర్ రింగురోడ్డులోని మహమ్మదీయ మసీదు మీదుగా వెళ్లి కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ వద్ద ముగుస్తుంది.

61- బడంగ్‌పేట్ డివిజన్

ఉద్యోగ్‌నగర్‌లోని మాస్టర్ మైండ్స్ స్కూల్ నుంచి మొదలై బడంగ్‌పేట్-నాదర్‌గుల్ రోడ్డు మీదుగా వెళ్లి ఆదిభట్లలోని వాటర్ ట్యాంకు నుంచి పడమరన ఉన్న ఆర్‌సీఐ ప్రహరీ పక్కన గల ఆర్యభట్ట డేటా సెంటర్, అక్కడి నుంచి షరీఫ్‌నగర్, శివాజీచౌక్, మహారాష్ట్ర బ్యాంకు, సాయినగర్, ఆర్‌సీఐ రోడ్డు దీప్తి సర్కిల్, ఎయిర్ పోర్టు రోడ్డు మీదుగా వెళ్లి సుల్తాన్‌పూర్ వద్ద ముగుస్తుంది.

62- బాలాపూర్ డివిజన్

ఆర్‌సీఐ రోడ్డులోని శివాజీచౌక్ నుంచి మొదలై బాలాపూర్-ఎయిర్ పోర్టు రోడ్డు, ఆర్‌సీఐ దీప్తి సర్కిల్, సుల్తాన్‌పూర్, మల్లాపూర్, రేణుకాపూర్, వెంకటాపూర్, బాలాపూర్, నక్షత్రకాలనీ, గణేశ్‌చౌక్ మీదుగా వెళ్లి శివాజీ చౌక్ వద్ద ముగుస్తుంది.

రెండు డివిజన్లుగా పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ

జీహెచ్‌ఎంసీలో విలీనం చేసిన పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీని రెండు డివిజన్‌లు(వార్డులు)గా విభజించారు. కుంట్లూర్, పెద్దఅంబర్‌పేట్ డివిజన్‌లుగా విభజిస్తూ ప్రభుత్వం ముసాయిదా విడుదల చేసింది.

51- కుంట్లూర్ డివిజన్

తూర్పు బాచారం సర్వే నంబర్ 39 మూసీ రివర్ నుంచి డివిజన్ ప్రారంభమవుతుంది. బాచారం పూర్తి గ్రామంతో పాటు తారామతిపేట గ్రామం సర్వే నంబర్ 216 వరకు. దక్షిణం వైపు తారామతిపేట సర్వే నంబర్ 216 నుంచి పోల్కంకుంట, ఓఆర్ఆర్ సర్వే నంబర్ 420, సీత వాగు, గౌరెల్లి రేడియల్ రోడ్డు, తిమ్మాయిగూడ జంక్షన్, గ్రామ హద్దు సర్వే నంబర్ 75 వరకు, కుత్బుల్లాపూర్ ఫారెస్ట్ ల్యాండ్ చివరి వరకు. సర్వే నంబర్ 152 వరకు. పడమర సర్వే నంబర్ 152 నుంచి కుత్బుల్లాపూర్ విలేజ్ చివరి మూసీ రివర్ వరకు. ఉత్తరం కుత్బుల్లాపూర్ మూసీ రివర్, తిమ్మాయిగూడ, గౌరెల్లి, ఓఆర్ఆర్ బాచారం, సర్వే నంబర్ 39 వరకు.

53- తొర్రూర్ డివిజన్

తూర్పు: కొహెడా సర్వేనంబర్ 178 వద్ద ప్రారంభమై గండిచెరువు, ఉమర్‌ఖాన్‌గూడ, ఉమర్‌ఖాన్ దాయర సరిహద్దులను ఆనుకుని సంఘీ పరిశ్రమ నుంచి రామోజీ ఫిల్మ్‌సిటి సర్వేనంబర్ 307 వద్ద ముగుస్తుంది.

దక్షిణం: ఆర్‌ఎఫ్‌సీ 307 సర్వేనంబర్ దగ్గర ప్రారంభమై ఆర్‌ఎఫ్‌సీ పడమర భాగం ఆనుకుని కొహెడా విలేజీ సర్వేనంబర్ 743 వరకు ఉంటుంది. అక్కడి నుంచి బ్రాహ్మణపల్లి మీదుగా తుర్కయంజాల్, మన్నెగూడ సరిహద్దు వరకు సర్వేనంబర్ 499 తుర్కయంజాల్ రిజర్వు ఫారెస్టు ఔటర్ రింగు రోడ్డు వద్ద ముగుస్తుంది.

పడమర: సర్వేనంబర్ 499 తుర్కయంజాల్ రిజర్వు ఫారెస్టు ఔటర్ రింగు రోడ్డు నుంచి ప్రారంభమై నాగార్జున సాగర్ హైవే ఉత్తరం వైపు నుంచి ఇంజాపూర్ కమాన్ వరకు వస్తుంది.

ఉత్తరం: ఇంజాపూర్ కమాన్ నుంచి ప్రారంభమై ఇంజాపూర్ శ్మశాన వాటిక పడమటి వైపు నుంచి సర్వేనంబర్ 4 నుంచి ఇంజాపూర్ హయత్‌నగర్ సరిహద్దు వరకు. అక్కడి నుంచి సర్వేనంబర్ 48/4 మునగనూర్ వరకు మళ్లీ అక్కడి నుంచి మునగనూరు సరిహద్దు మీదుగా కోహెడా సర్వేనంబర్ 948 వరకు మళ్లీ అక్కడ నుంచి సర్వేనంబర్ 178 కొహెడా వద్ద ముగుస్తుంది.

52-పెద్దఅంబర్‌పేట్ డివిజన్

తూర్పు: పసుమాముల విలేజ్ సర్వేనంబర్ 93 నుంచి సర్వే నంబర్ 677 పెద్దఅంబర్‌పేట్ విజయవాడ జాతీయ రహదారి వరకు.

దక్షిణం: సర్వే నంబర్ 676 నుంచి మొదలు పెద్దఅంబర్‌పేట్ విలేజ్, సర్వే నంబర్ 572 మునగనూర్ రోడ్డు వరకు.

పడమర: సర్వే నంబర్ 572 నుంచి పెద్దఅంబర్‌పేట్, కుంట్లూర్, హతిగూడ, తట్టిఅన్నారం, మర్రిపల్లి మూసీ రివర్ వరకు.

ఉత్తరం: మర్రిపల్లి గ్రామం నుంచి తట్టిఖానా విలేజ్, పసుమాముల గ్రామ సర్వే నంబర్ 93 వరకు.

56- తుర్కయంజాల్ డివిజన్

తూర్పు వైపు: ఇంజాపూర్ శ్మశాన వాటిక పడమటి వైపు నుంచి ప్రారంభమై ఇంజాపూర్ కమాన్ వరకు అక్కడి నుంచి నాగార్జున సాగర్ హైవే ఆనుకుని తుర్కయంజాల్ రిజర్వు ఫారెస్టు సర్వేనంబర్ 499 ఔటర్ రింగు రోడ్డు వరకు.

దక్షిణం: తుర్కయంజాల్ రిజర్వు ఫారెస్టు సర్వేనంబర్ 499 ఔటర్ రింగు రోడ్డు నుంచి ఎంఎం కుంట మీదుగా సర్వేనంబర్ 655 తుర్కయంజాల్ విలేజీ వరకు.

పడమర: సర్వేనంబర్ 655 ఎంఎంకుంట నుంచి నాగార్జునసాగర్ హైవే ఉత్తరం వైపు గుర్రంగూడ ఫారెస్టు నుంచి సర్వే నంబర్ 93 వరకు.

ఉత్తరం: గుర్రంగూడ ఫారెస్టు సర్వేనంబర్ 93 నుంచి ప్రారంభమై ఇంజాపూర్ గ్రామం సరిహద్దు నుంచి ఇంజాపూర్ శ్మశానవాటిక వద్ద ముగుస్తుంది.

ఎర్రకుంటను అభివృద్ధి చేస్తాం: హైడ్రా కమిషనర్ రంగనాథ్



రికార్డులు పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

సైదాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ఎర్రకుంటను ప్రభుత్వం సహకారంతో బతుకమ్మ కుంట స్థాయిలో అభివృద్ధి చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. మంగళవారం సైదాబాద్ ధోబీఘాట్‌లోని ఎర్రకుంటను ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 6.02 ఏకరాల ఎర్రకుంట కబ్జా అవుతుందనే స్థానికుల ఫిర్యాదు మేరకు సందర్శించినట్లు తెలిపారు. ఎర్రకుంటను అభివృద్ధి చేస్తే సైదాబాద్‌కు ఐకాన్‌గా మారుతుందని వెల్లడించారు. కొందరు ఎర్రకుంట చెరువు స్థలాన్ని పట్టా భూమిగా వివాదం చేస్తున్నారని తెలిపారు. పూర్తి ఆధారాలతో ఎర్రకుంటను హైడ్రా ఆధీనంలోకి తీసుకుని ప్రభుత్వ సాయంతో మోడల్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి, మాజీ కార్పొరేటర్లు స్వర్ణలతారెడ్డి, సహదేవ్ యాదవ్ నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, నేతలు భూమేశ్వర్, శ్రీకాంత్ రెడ్డి, పగిల్ల శ్రీనివాస్ రెడ్డి, కాలనీ, బస్తీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ కల సాకారం: సబితారెడ్డి



జిల్లెలగూడలో తెలంగాణ విజయ్ దివస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 11 రోజులు చేసిన నిరాహార దీక్షతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కల సాకారమయిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. విజయ్ దీక్షా దివస్ సందర్భంగా మంగళవారం మీర్‌పేట్ సర్కిల్ జిల్లెలగూడలోని చందచెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడి అంబేడ్కర్ విగ్రహానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పింక్ బెలూన్లు గాల్లోకి వదిలారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ 2009 డిసెంబరు 9న నాటి కేంద్ర హోంమంత్రి చిదంబరం స్వయంగా కేసీఆర్‌కు ఫోన్ చేసి ప్రత్యేక రాష్ట్ర ప్రకటన గురించి తెలియజేశారని, ఆయన హామీతోనే కేసీఆర్ దీక్ష విరమించారని అన్నారు. కాగా, ప్రస్తుత అధికార పార్టీలోని నేతలు కేసీఆర్ దీక్షపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది ఎంత మాత్రం సహేతుకం కాదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఔనన్నా కాదన్నా కేసీఆర్ వల్లనే రాష్ట్రం సిద్ధించిందన్నది జగమెరిగిన సత్యమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బడంగ్‌పేట్, మీర్‌పేట్ సర్కిళ్ల అధ్యక్షులు, నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంపాపేట డివిజన్‌లో..

చంపాపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ రెడ్డికాలనీలోని దివ్యాంగుల వసతిగృహంలో మంగళవారం బీఆర్ఎస్ యువ నాయకుడు గండికోట శ్రీనాథ్ ఆధ్వర్యంలో విజయ్ దివాస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దివ్యాంగులకు పండ్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మనీష్, యశ్వంత్ , కోమల్, భాను, సాయి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, తీగల అనితాహరినాథ్‌రెడ్డి తదితరులు

సరూర్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం మీర్‌పేట్, బడంగ్‌పేట్ సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. మీర్‌పేట్‌లోని బాలాపూర్ చౌరస్తా, మంద మల్లమ్మ చౌరస్తా, మీర్‌పేట్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జడ్పీ మాజీ చైర్ పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు.

● బడంగ్‌పేట్ చౌరస్తాలో కాంగ్రెస్ బడంగ్‌పేట్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సోనియా జన్మదిన వేడుకల్లో మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, టీపీసీసీ సభ్యుడు వై.అమరేందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి స్థానికులకు పంచిపెట్టారు.

● చంపాపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీభవన్ లో కేక్‌కట్ చేసి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసి మహిళకు తినిపిస్తున్న టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్

● చాదర్‌ఘాట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సోనియాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్‌గౌడ్, రాహుల్, చక్రపాణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిషన్ సింగ్, నాయకులు మహేష్‌కుమార్ కలిసి టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు.

● ఓల్డ్‌మలక్‌పేట డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఓల్డ్‌మలక్‌పేటలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చౌకి రవికుమార్, అజంపురా సేవాదళ్ అధ్యక్షుడు ఎండీ గౌసుద్దీన్, పి.రాము, శ్యాం, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

● దిల్‌సుఖ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చైతన్యపురి డివిజన్ సీనియర్ నాయకుడు కె.శశిధర్‌రెడ్డి, గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు బద్దుల వేణుగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం రాజీవ్‌చౌక్ వద్ద సోనియాగాంధీ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునీల్‌బాబు, వెంకటేష్‌చారి, బాబుగౌడ్, జితేందర్, నవీన్ గౌడ్, సురేష్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు 42 మంది, వార్డులకు 363 మంది

● అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో బరిలో నిలిచిన అభ్యర్థులు
● ఒక సర్పంచ్, ఐదు గ్రామాల్లోని 8 వార్డులు ఏకగ్రీవం

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని 14 సర్పంచ్, 134 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. చివరి రోజు మంగళవారం నామినేషన్ల ఉపసంహరణల అనంతరం మొత్తం 405 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. చివరగా సర్పంచ్‌కు 42 మంది, వార్డు స్థానాలకు 363 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. పిగ్లీపూర్ సర్పంచ్ పదవికి 6 నామినేషన్లు దాఖలు కాగా మంగళవారం ఐదుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉప సంహరించుకున్నారు. దీంతో ఒక్క నామినేషన్ మాత్రమే మిగిలి ఉండడంతో ఆ గ్రామ సర్పంచ్ ఏకగ్రీవం అయింది. కవాడిపల్లి, ఇనాంగూడ, గుంతపల్లిలో ఒక్కోవార్డు, లష్కర్‌గూడలో 2, పిగ్లీపూర్‌లో 3 వార్డులు మొత్తం 8 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ఈ నెల 17న 13 సర్పంచ్, 126 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఫైనల్ పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా విడుదల చేసిన అధికారులు మంగళవారం మధ్యాహ్నం బరిలో నిలిచిన సర్పంచ్, వార్డు అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించారు.

భూ వివాదం.. ఒకరిపై ఒకరు దాడి

● అన్నదమ్ముల కుటుంబాలపై కేసు నమోదు

హయత్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో అన్నదమ్ముల పిల్లలు ఒకరిపైన ఒకరు దాడి చేసుకున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... హయత్‌నగర్ పాపయ్యగూడ (అంజనాద్రినగర్)కు చెందిన గడ్డం నర్సింహ యాదవ్ జంగయ్య, కృష్ణ, అంజయ్య, సత్యనారాయణ అన్నదమ్ములు. వీరికి స్థానికంగా సర్వేనంబర్ 216, 218, 219లలో సుమారు 20 ఎకరాల భూములు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భూ వివాదంలో వీరంత కోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా సోమవారం మధ్యాహ్నం పాపయ్యగూడలో గడ్డం కృష్ణ, కుమారులు రాజు, సోమేష్, కూతురు సాహితి, భార్య బాలమణి, గడ్డం సత్యనారాయణ కుటుంబానికి చెందిన జంగయ్య, అంజయ్య, సత్తయ్య, నవీన్, పరమేష్, సురేందర్, హరిశంకర్ ఒకరిపైన ఒకరు దాడి చేసుకున్నారు. రాజుపై కర్రతో దాడి చేయడంతో తల పగిలింది. పరమేశ్‌తోపాటు వారి కుటుంబసభ్యులకు గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. రాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి



వంశీకృష్ణ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని బీటెక్ విద్యార్థి మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్ల చెరువు గ్రామానికి చెందిన అంబాల వంశీకృష్ణ (21) అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతూ ప్రైవేటు హాస్టల్ ఉంటున్నాడు. కాగా, మంగళవారం కళాశాల నుంచి స్నేహితుడు విజయ్‌కుమార్ ద్విచక్రవాహనంపై వెనుకాల కూర్చుని దేశ్‌ముఖ్ గ్రామంలోని సెయింట్ మేరీస్ కళాశాలలో పరీక్ష రాయడానికి వెళ్తున్నాడు. మధ్యాహ్నం కవాడిపల్లి ఎక్స్ రోడ్డు వద్దకు రాగానే లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో వంశీకృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు యువకులపై పెట్టీ కేసు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): హుక్కా సేవిస్తున్న ఫిర్యాదుతో ఇద్దరు యువకులపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు పెట్టీ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫర్హిన్, రాజేష్ ఇద్దరు స్నేహితులు. ఆదివారం ఉదయం ఇద్దరు కలిసి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోహెడ గుట్ట పైకి వెళ్లారు. అక్కడి గుట్ట ఆటవీ ప్రాంతంలో ఇద్దరు సైడ్ సీన్స్‌లో ఫొటోలు తీసుకుంటున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన కొందరు హిందూ కమ్యూనిటీకి చెందిన వ్యక్తులు వారితో వాగ్వివాదానికి దిగారు. అంజనేయ స్వామి ఆలయం సమీపంలో హుక్కా సేవిస్తున్నారని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి వెళ్లిన పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై పెట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.